క్లుప్తంగా

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఎన్నిక



మద్దూరు: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మండల కమిటీని ఆదివారం మండలంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పిల్లి వెంకటప్ప, ఉపాధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా డబ్బరాము, యూత్ కన్వీనర్‌గా బంటురమేష్, కార్యదర్శిగా రవినాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. నూతన కమిటీ ద్వారా మండలంలో ఆర్‌టీఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కుర్మయ్య, పేట అసెంబ్లీ అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

జాతర పోస్టర్ విడుదల



మరికల్: మాగనూర్ మండలం నేరడగంలో జరిగే సిద్ధలింగేశ్వర జాతర పోస్టర్ ఆదివారం శివాలయంలో సిద్ధలింగ స్వామి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16నుంచి 18వరకు జరిగే జాతరను జయప్రదం చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బసంత్, వీరన్న, జగదీష్, మల్లికార్జున్, శేఖర్, శివకుమార్, సోమనాథం, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సేవలో మహిళా భక్తులు



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన భక్తులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన 15మంది మహిళలు మూడు రోజులుగా తిరుమలలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వారు తెలిపారు. వారికి దేవాస్థానం వారు వసతీ దర్శనం కల్పించినట్లు పేర్కొన్నారు. తరలివెల్లిన బక్తులు పద్మమ్మ, సునిత, సునంద, జయమ్మ, మంజుల, సత్యమ్మ, ప్రసన్న తదితరులు ఉన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం



నారాయణపేట: పట్టణంలోని శ్రీ బాలాజీ మందిర్‌లో మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలత బన్సీలాల్ లాహోటి స్వగృహం నుంచి ఆటపాటలతో భజన సంకీర్తనలతో బాలాజీ మందిర్ వరకు ఉత్సవమూర్తి విగ్రహాల ఊరేగింపుతోపాటు ప్రత్యేకపూజలు చేసి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్వరీ, సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

పతంగులు అందజేత



మరికల్: సంక్రాంతి పండగ సందర్భంగా మండల కేంద్రంలోని గౌతమ్ మోడల్ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు కరస్పాడెంట్ రాజేందర్‌రెడ్డి పతంగులను అందజేశారు. అలాగే విద్యార్థులచే ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేకం దాడిలో గేదె మృతి

మరికల్: మండలంలోని అప్పంపల్లి శివారులో రాత్రి మేకం దాడి చేయడంతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద ఎప్పటి మాదిరిగానే శనివారం రాత్రి పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన మేకం గేదెపై దాడి చేయడంతో అక్కడిక్కడే మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. రూ.50వేల విలువ చేసే గేదె మృతి చెందడంతో బాధిత రైతు ఆవేదన చెందాడు.



దామరగిద్దలో నివాళులర్పిస్తున్న నాయకులు



కోస్గిలో..



బిజ్వార్‌లో..

వివేకానందుడి అడుగుజాడల్లో నడుద్దాం

సాక్షి, నెట్‌వర్క్: స్వామి వివేకానందుడి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులతోపాటు యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ హితం కోసం పనిచేయాలని కోరారు.

నారాయణపేట: కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ పార్కులో వివేకానంద విగ్రహానికి మార్కెట్ చైర్మన్ శివారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. గండె చంద్రకాంత్, సరాఫ్ నాగరాజు, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప, సతీష్‌గౌడ్,వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

● స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌ఐ రాము అన్నారు. మరికల్‌లోని యువక మండలి భవనంలో బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి, హరీష్, మల్లయ్య, రవికిరణ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

● కృష్ణా మండలంలోని దర్శశాలలోని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు అమర్‌కుమార్ వివేకానందుడి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నర్సప్ప, రాంచంద్ర, మాస్టర్, రుద్రప్ప, భీమ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పేటలో చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

● ఊట్కూరు మండలంలోని బిజ్వార్‌లో వివేకానంద జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, శరత్, కృష్ణయ్య, నర్సింహ, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● కోస్గి/కోస్గిరూరల్: పట్టణంలోని స్థానిక వివేకానంద చౌరస్తాలో వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పాలెం ప్రశాంత్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాము, వెంకటేష్, బద్రినాథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడ్మూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కున్సిలో..



మరికల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



ధన్వాడలో ..

బాధితులకు అండగా ఉంటాం



బాధితుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని కుమార్‌లింగంపల్లికి చెందిన బాధితుడు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్‌ఓసీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుమార్‌లింగంపల్లికి చెందిన దాసరి వినోద్ ఆరోగ్య ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్యఖర్చులకు రూ.5లక్షల ఎల్‌ఓసీని అందించి ఆదుకుంటున్నామన్నారు. ప్రతి పేదవారికి ప్రభుత్వపరంగా వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసం చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, రవి, అశోక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

మక్తల్: పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి కాలనీలను సందర్శించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి న్నారు. ఆదివారం మండలంలోని బురాన్‌గడ్డ వీధిలో సందర్శించారు. కాలనీల్లో తాగునీటి, డ్రైయినేజీ, సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఫయాజ్, సభ్యుడు శంశోద్దీన్, రహీంపటేల్, నయూమ్, రఫీ, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్: పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని.. క్రీడాకారులు క్రమశిక్షణతో ఉండాలని అప్పుడే గమ్యస్థానం చేరుతారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం విభాగ్‌స్థాయి ఖేల్‌ఖూద్ పోటీలు రెండోరోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని వివరించారు. అనంతరం పాలమూర్ విభాగ్ ఉపాధ్యక్షుడు మద్ది అనంత్‌రెడ్డి మాట్లాడుతూ.. శిశుమందిరాలు విలువతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థి సంపూర్ణ వికాసమే లక్ష్యంగా పని చేస్తున్నాయని.. 50 ఏళ్లుగా తనదైన శైలిలో ప్రత్యేక గుర్తింపు సంపాదించాయన్నారు. అనంతరం పీఈటీలను మాజీ ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, ఎంఈఓ అనిల్‌గౌడ్, మక్తల్ సీఐ చంద్రశేఖర్, విశ్రాంత పీఈటీ గోపాలం, సరస్వతి శిశుమందిర్ నిర్మాణ అధ్యక్షుడు కొండయ్య, పట్టణ అధ్యక్షుడు చిన్నహన్మంతు, అధ్యక్షుడు రఘుప్రసన్న భట్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బస్టాండ్‌లో అనుమానితుల వేలిముద్రలు తీసుకుంటున్న పోలీసులు

నారాయణపేట రూరల్: దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికులు, అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు విలువైన వస్తువులు, సెల్ ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రయాణించేటప్పుడు కొత్త వ్యక్తులు ఏమైనా తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దని ఎస్‌ఐ తెలిపారు. అలాగే కాలనీలలో కొత్త వ్యక్తులు సంచరిస్తే వారి సమాచారం వెంటనే పోలీసులకు ఇవ్వాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 100 కాల్ చేయాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రుబీన

కృష్ణా: ప్రయాణికులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ రుబీన ప్రవీన్‌కుమార్ వాహనదారులకు సూచించారు. ఆదివారం మండల సరిహద్దులోని చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీచేయడంతోపాటు ప్రయాణికులకు పలు సూచనలు అందజేశారు. వాహనదారులు సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించాలని, నియమిత వేగంతో ప్రయాణించాలన్నారు. అదేవిధంగా అనుమతులు లేని వాహనాలు, నిబంధనలు అతిక్రమించిన వాహనాలు మొత్తం 14 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయాలని, తద్వారా మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగ పాండురెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. మొత్తం 45మంది యువకులు, మహిళలు రక్తదానం చేశారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భానుప్రకాష్, సెక్టోరియల్ అధికారి నాగార్జున్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, రఘువీర్‌యాదవ్, సభ్యులు సతీష్, వెంకటేష్, ఇంతియాజ్, చరణ్, అరుణ్, అనిల్, వివేకానంద పాల్గొన్నారు.



పేటలో రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



నారాయణపేట: జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు సుభాష్‌రోడ్ మార్కండేయస్వామి ఆలయంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. యువజన కాంగ్రెస్ నాయకుడు బండి ఆనంద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చిన్నారులు, మహిళలు ఉత్సాహంతో పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను చైతన్య ప్రసాద్ దంపతులు, బండి అఖిల అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీలు విద్య, శోభారాణి, వార్డు మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి క్షీరలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



లింగేశ్వరస్వామి మూలవిరాట్

కృష్ణా: ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాన మండల కేంద్రంలోని శ్రీ క్షీర లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. సోమవారం ఉదయం స్వామి ఆలంకారం, అభిషేకం, సాయంత్రం మంగళ వాయిద్యాలతో పల్లకిలో సేవా అనంతరం ప్రభోత్సవం. 14న ఉదయం పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను కృష్ణానదికి గంగా స్నానానికి తీసుకెళ్లడం, సాయంత్రం 5గంటలకు స్వామివారి రథోత్సవం. ఈ ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రా మస్తులు తమ ఇళ్లల్లో వండిన పిండివంటలు స్వామివారికి నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకుగాను చుట్టూ పక్కల గ్రామస్తులు అధికసంఖ్యలో కృష్ణానదికి ఎడ్లబండ్లలో, వాహనాల్లో చేరుకుని స్నానాలు ఆచరిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో ప్రతి రోజు భక్తి ప్రవచన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతంచేయాలని శ్రీ వృషభ లింగేశ్వర మహాస్వామి కోరారు.

ధ్యానంపై అవగాహన



నర్వ: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సమన్వయకర్త నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ధ్యానంపై అవగాహన కల్పించారు. ధ్యానం సాధనచేస్తే ఒత్తిడిని పూర్తిగా జయించవచ్చన్నారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ నరేష్, వడ్డె మనోహర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు ముమ్మర ప్రచారం



కాలనీలో కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దామరగిద్ద: ప్రభుత్వం గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకోసం ప్రచారం నిర్వహిస్తు ప్రవేశ పరీక్షపై ఉపాధ్యాయులు గ్రామాల్లో కరపత్రాలను అందజేసి ప్రచారం చేస్తున్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, అలివేలు మాట్లాడుతూ.. పేద విద్యార్థులను కలిసి గురుకులాల్లో ఉచిత విద్యావసతి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 1వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదోతరగతితోపాటు 9వ తరగతి వరకు ప్రవేశాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులని అన్నారు. ప్రవేశ పరీక్ష రాయదలిచిన విద్యార్థులు తమ కుల ధ్రువీకరణ, ఆధార్, బొనఫైడ్, పాస్‌ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



పేటలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మధుసూదన్



దామరగిద్దలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



మరికల్‌లో..

దామరగిద్ద: యువత చదువుతోపాటు గ్రామీణ క్రీడల్లో ప్రతిభ కలిగి ఉండాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ సంపర్క్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక భవాని ఆలయ ఆవరణలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆయా మండలాల్లోని 16టీంలు పోటీల్లో పాల్గొన్నాయి. జాదవరావుపల్లి కబడ్డీ బృందం మొదటి స్థానంలో నిలవగా ద్వితీయ బహుమతి కాన్‌కుర్తి టీం గెలుపొందింది. ప్రభాకర్, రాఘవేందర్‌గౌడ్, బసిరెడ్డి, పీఈటీలు వెంకటప్ప, శరణ్యానాయక్, విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మధుసూదన్ రెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు.. అనంతరం బహుమతులకు రూ. 40వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో సురేష్, రవి, వెంకటేష్, లక్ష్మణ్, హరీష్, శివకుమార్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింతలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహకులు ప్రారంభించారు. అంతకుముందు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టోర్నమెంట్ విన్నర్‌కు రూ.10 వేలు ట్రోఫీ, రన్నరప్‌కు రూ.5వేలు ట్రోఫీని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విజయ్ కుమార్,శ్రీనివాస్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటలపోటీలు

కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని హన్మాన్‌పల్లిలో చిన్నారులకు ఆటపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభ చాటారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కోటకొండ రాము, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్టు అందజేత

మరికల్: మండలంలోని ఎలిగండ్ల గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు ఆదివారం మరికల్‌కు చెందిన ఓబీసీ సెల్ చైర్మన్ గొల్ల కృష్ణయ్య క్రికెట్ కిట్టు అందజేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బెల్టులను అందజేసి అభినందిస్తున్న మార్కెట్ మాజీ చైర్మన్ చెన్నారెడ్డి

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ఆదివారం శ్రీ నారాయణ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చెన్నారెడ్డి మాట్లాడుతూ.. కరాటే నేర్చుకోవడంతో క్రమశిక్షణ, శారీరక ధ్రుడత్వం, ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. కరాటే ఫౌండర్ ఇండియా స్టైల్ చీఫ్ సలాంబిన్ ఉమర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కరాటే సెక్రటరీ షేక్ అబ్దుల్ సలాం, సి. అంబ్రేష్, మొహమ్మ సలీం, అశోక్, ధర్మ, చాంద్ పాషా, నవీన్, తాయప్ప, శ్రీనివాస్, మాయ తదితరులు పాల్గొన్నారు.

దండోరా ధూంధాం విజయవంతం

ఊట్కూరు: మండలంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ధూంధాం కార్యక్రమం విజయవంతమైంది. తిప్రాసిపల్లి, ఊట్కూరు గ్రామాల్లో డప్పు కళాకారులు నృత్యాలతో, డప్పులతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ డప్పు స్వామి మాట్లాడుతూ.. వచ్చేనెల 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామం నుంచి వందలాది మంది డప్పులతో కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్, నాయకులు గుడిసె వెంకటయ్య, రాజమ్మ, డీకే నర్సింహ, శంకర్, కొండన్ గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.